# గాలిగోపురం

కుటుంబరావు హైబట్టతో గుంటూరు వచ్చాడు. అమ్మకు తిన్నంతకాలం తిని అమ్మకోడానికి ఇక ఏమీ మిగలని స్థితివచ్చాక ఆయనలా గుంటూరు రావడం జరిగింది. రైలు స్టేషనునుంచి కొద్ది దూరం వచ్చాక అమ్మకోడానికో, తాకట్టు పెట్టడానికో, తనదగ్గిర ఏదో ఒక వస్తువు ఉండకపోతుందా అని అలవాటు చొప్పున ఆయన జేబుల్లో చేతులు పెట్టి వెతికాడు. అవి ఖాళీగా ఉన్నాయి. లాల్చీ జేబులే కాదు బనీను లోపలిజేబు కూడా ఖాళీగా ఉన్నది. అందులో ఖాళీపర్సు కూడా లేకుండా పోయింది. ఆయన తన రెండు చేతుల వంకా కోపంగా చూచుకొన్నాడు. "అవును. గడియారం అమ్మి రెండు నెలలు అయింది. ఉంగరం అమ్మి నెల దాటింది. అరె. పెన్ను - పార్కర్ కలం - అది తాకట్టుపెట్టి మొన్ననేకదా పది రూపాయలు తీసుకొన్నాను! అంతలో అంత మతిమరుపా? ఇలా అయితే నిన్ను అందరూ మతిమరుపు కుటుంబరావు అంటారు.' అని ఎవరో అంటున్నట్లే అనిపించిందాయనకు. భుజాన ఉన్న టర్కీ తువాలు తీసి ఒకసారి దులిపి, ముఖం తుడుచుకొని, ఆయన గబగబా ఊళ్లోకి వెళ్ళాడు. అలా త్వర త్వరగా నడుస్తూ 'ఈ తువ్వాలు ఎవరూ కొనరు కదా' అనకొని ఆయన నవ్వుకొన్నాడు.

ఎంత కష్టం వచ్చినా ఆయన అలా నవ్వేయగలడు. తండ్రి ఆస్తి అంతా పాడుచేసి ఆయనకు అప్పులు మాత్రమే వప్పగించినప్పుడు ఆయన నవ్వుతూ' పోనీ మా నాన్న నాకు అప్పులయినా ఇచ్చాడు.

ఎంతమంది తండ్రులు కొడుకులకు ఏమీ ఇవ్వకుండానే పోతున్నారు' అని నవ్వేశాడు.

బి. కామ్. ప్యాసయితే బ్యాంకు ఉద్యోగం అదే వస్తుందని అందరూ అనుకొన్నట్లే ఆయనా అనుకొన్నాడు. చివరకు ఆమాట అబద్ధమనీ, ఇంటర్వ్యూకు ముందే మొక్కుకొని, సరిగ్గా ఆనాడు ముడుపు చెల్లిస్తేగాని ఫలితం దక్కదని అనుభవపూర్వకంగా తెలిసినప్పుడు ఆయన నవ్వుతూ 'బి. కామ్. అంటూ వాళ్లు పత్రం ఇచ్చారు. అందువల్ల ఎవరినీ విమర్శించకుండా కామ్‌గా ఉండడమే నా కర్తవ్యం అనుకొని అప్పటికి శాంతం వహించాడు. పెండ్లిలో కట్నంగా ఇస్తానన్న మూడువేలూ తన మామగారు ఇవ్వలేక పోయినప్పుడు ఆయన తల్లిదండ్రులు పెండ్లిపీటలమీదనుంచి లేవతీసుకొని పోవటానికి సిద్ధమయ్యారు. అప్పుడు ఆయన నవ్వుతూ "ఋణపత్రం వ్రాసి ఇవ్వండి మామగారూ. మానాన్న అప్పులు తీర్చడం మొదలు పెట్టినప్పుడు ఈ డబ్బు ఇవ్వండి. అప్పటిదాకా ఈ పత్రం ఇలాగే ఉండనివ్వండి. మాకూ ఒకళ్ళు కొంతబాకీ ఉన్నారు సుమా అని చెప్పుకోడానికిది దాఖలాగా ఉంటూ ఉంటుంది' అన్నాడు. అంతేకాదు పెళ్లికూతురు మెడలో పుస్తెకడుతూ 'కమలమ్మా మీనాన్న నాకు మూడువేలు ఇవ్వాలి. కనుక మూడుముళ్లు వేస్తున్నాను గుర్తుంచుకో. మూడు వేలివ్వాలి. ఇదే ఆరువేలు ఇవ్వవలసి ఉంటే నేను ఖచ్చితంగా ఆరుముళ్లూ వేసేవాణ్ణే' అన్నాడు నవ్వుతూ. అప్పుడాయన అత్తగారు వచ్చి 'సాధ్యమైనంత త్వరలోనే సర్దుబాటు చేస్తామండీ - మీరంతా మంచివారు కనుక మేం బ్రతికిపోయాం అంటూ కృతజ్ఞత తెలుపుకొంటూ ఉంటే ఆయన తల్లి ముందుకువచ్చి 'ఆ మహా చెప్పొచ్చావు లేవమ్మా ఇంక ఊరుకో. రేపే అప్పు తీర్చేదానిలా మాట్లాడుతున్నావు' అంటూ తగూకు సిద్ధపడ్డది. అప్పుడు ఆయన నవ్వుతూ "అమ్మా నేను వేసిన

ఈ ముళ్ళలాగానే ఈ అప్పుకూడా శాశ్వతంగా ఉండాలని కోరుకొంటున్నాను" అన్నాడు.

ఆయన అనేకరకాల ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు.

ఒకనాడు ఉద్యోగం కోసం గుడివాడ వెళ్ళాడాయన. అక్కడ ఓ చిన్న ఉద్యోగం ఇవ్వచూపిన ఆ పెద్దమనిషి ఇంటర్వ్యూ చేసే సరదా తీర్చుకొని, దేశంలో పెచ్చుమీరిపోతున్న నిరుద్యోగ సమస్యను గురించి వ్రాసుకొని దగ్గర ఉంచుకొన్న వ్యాసంలోనుంచి వివిధ అంశాలు వివరిస్తూ, మధ్య మధ్య ఆ కాగితాలు చూచుకొంటూ అప్పటికప్పుడు ఆ విషయమై ఉపన్యాసం ఇస్తున్నట్లు నటిస్తూ, అవీ ఇవీ మాటాడి, చివరకు 'మీరుచూస్తే కొంచెం ఉన్నవారు లాగానే ఉన్నారే. మీకీ చిన్న ఉద్యోగం ఎందుకండీ? అని అడిగాడు. తనకా ఉద్యోగం రాదని కుటుంబరావుకు రూఢి అయింది. అయినా ఆయన బాధపడక నవ్వుతూ 'మీరు ఇలా అనుకొంటారని నే నూహించలేక పోయాను. నాకీవిషయం తోచలేదు. సుమండీ! తోచిఉంటే మాసిన దుస్తులే వేసుకొని మీ దర్శనానికి వచ్చేవాణ్ణి. గడ్డం కూడా పెంచుకొనే వచ్చేవాణ్ణి. నేను ఉన్నవాణ్ణని మీరెలా అనుకొన్నారో నాకు తెలియడం లేదు. ఈ ఇంటర్వ్యూల కోసమని మూడు నెలల క్రితం అప్పుచేసి మూడుజతల బట్టలు కుట్టించాను. ఇవ్వాళ వేసుకొని వచ్చింది మూడవ జత. మొదటి రెండూ కొంచెం చినిగాయి - పూటపూటా అవే ఉతికి ఆరవేయడంవల్ల. ఆ మాత్రమైనా చినిగాయి కనుక అవివేసి స్టెయిన్‌లెస్ సామాన్లు ఏవో తీసుకొంటానని నాభార్య పట్టుబడుతోంది. ఈ విషయం నాకు ముందుగా తెలిసిఉంటే అవే వేసుకొని వచ్చేవాణ్ణి. ఇక గడ్డం విషయం అంటారా దానిదేముందీ- మార్వాడి అప్పు పెరిగినట్టు పెరుగుతుంది. కాదనేవారు ఎవరూ ఉండరు. మొక్కు ఉన్నదంటే

చాలు గ్రుచ్చుకొంటున్నా మాట పైకి అనే ధైర్యం ఎవరిభార్యకూ లేదు మనదేశంలో. ఇంతకూ చెప్పవచ్చిన మాటేమంటే నేను అవసరమైతే ఇటువంటి అబద్ధం ఆడగలను. ఆడానుకూడానూ ఒకసారి. మొన్న బందరులో జరిగిన ఒక ఇంటర్వ్యూలో చిన్న అబద్ధం చెప్పాను. నేను బీ కాం. ప్యాసుకాలేదన్నాను. ఇంటరు అయితే చాలునని వాళ్ళు పత్రికా ప్రకటనలో తెలియజేశారు. నాకా ఇద్యోగం ఇప్పించమని ప్రాధేయపడ్డాను. కాని వాళ్లు ఆ ఉద్యోగం ఎస్. ఎస్ ఎల్. సి. ప్యాసైన కుఱ్ఱవాడికి ఇచ్చారు. నాకేమో ఏదోలా బి. ఏ. కూడా ప్యాసు కమ్మని సలహా ఇచ్చారు. అప్పుడు నేను నిజం చెప్పాను. నేను ముందు అబద్ధం ఆడినందుకు వాళ్ళకు కోపం వచ్చింది. నీవు అబద్ధం ఆడావు కనుక నువ్వు బి. ఏ. అయినా ఎమ్. ఏ. అయినా నీకు ఉద్యోగం ఇవ్వం అన్నారు. పెద్ద సిఫార్సులో మరోటో లేనిదే ఉద్యోగాలు దొరకవని నాకు అప్పుడు స్పష్టంగా తెలిసింది. ఇప్పుడు మళ్ళీ జ్ఞాపకం వచ్చింది. మరి సెలవు'' అని తిరిగి వచ్చాడు.

*　　　*　　　*

అలా గుంటూరు చేరిన కుటుంబరావు కొద్దికాలంలోనే వ్యాపారంలో గట్టివాడని అందరిచేతా అనిపించుకొన్నాడు. డబ్బు సంపాదించటం మొదలైనప్పటినుంచీ రెండుచేతులా సంపాదించాడు. ముందు తండ్రిచేసిన అప్పులు తీర్చాడు. కుటుంబ ప్రతిష్ఠ నిలబెట్టుకొన్నాడు.

వ్యాపారరీత్యా అప్పులు చెయ్యడంలో కంటె ఆ అప్పులు తీర్చడంలో కుటుంబరావుకు గొప్ప పేరు వచ్చింది. వెయ్యి అయినా లక్ష అయినా ఇస్తానన్న సమయానికి ఒక్క నిముషం కూడా అటూ ఇటుకాకుండా ఇచ్చేస్తాడని ఆయనకు ప్రతిష్ఠ వచ్చింది. ఏది ఏమైనా

నరే- ప్రపంచం తల్లక్రిందు లవుతున్నా సరే ముందు నిర్ణయించుకొన్న ప్రకారం బాకీ పూర్తిగా సరిగ్గా సమయానికి తీర్చేయడం ఆయనకు అలవాటు. ఒకసారి ఒక బొంబాయి వర్తకుడి దగ్గర పదిహేను వేల రూపాయల సరుకుకొన్నాడు. ఆ సొమ్ము తాను స్వయంగా బొంబాయి వెళ్ళి జమ కట్టాలని నిర్ణయించుకొన్నాడు. కాని ఆ తేదీకి ముందుగా వాన వచ్చింది. బొంబాయికి వెళ్లే రైలుమార్గం దెబ్బతిన్నది. ఆయన ముందు మద్రాసు వెళ్ళి అక్కడినుంచి విమానంలో బొంబాయి చేరుకొని అనుకొన్నదానికి ఒకగంట ముందుగానే ఆ వర్తకసంస్థ యజమానికి సొమ్ము చెల్లించాడు. అప్పటినుంచి ఆ సంస్థ యజమానితో ఆయనకు స్నేహం కలిసింది. వాళ్ళు ఆయనకు లక్ష రూపాయల సరుకు ఇచ్చి పంపారు.

అంత త్వరలోనే ఆయన లక్షాధికారి కాగలడని ఎవ్వరూ ఊహించలేదు. మధురస్వప్నం ఫలించినట్లు అయింది. మొదట లక్ష రూపాయలు సంపాదించడమే కష్టమైంది ఆ తర్వాత అదే పెరిగింది. అయితే ఆయన డబ్బు ఎవరికి వడ్డీలకు ఇవ్వలేదు. అందువల్ల ఆయన ధనసంపద దానంతట అది పెరగలేదు. ఆయన వ్యాపారదక్షత మూలంగా నిర్విరామమైన కృషిమూలంగా ఆ సంపద పెరిగింది. అయిదారు సంవత్సరాలు తిరక్కముందే ఆయన పదిలక్షలు వ్యాపారం మీద తిప్పాడు. ఆ ఊళ్లోనే కాదు ఆ జిల్లా మొత్తంమీద ఆయనకు పరపతి పెరిగింది.

కుటుంబరావు వ్యాపారం అంతా ఆడొక చమత్కారంగా నడిచింది. ఆయనకు అనేకసార్లు అంతకుముందు ఎన్నడూ ఎవ్వరూ కనీవినీ ఎరుగనంతటి పెద్ద ఎత్తున లాభాలు వచ్చాయి. కొన్నిసార్లు కొంత పెద్ద మొత్తాలలోనే నష్టాలు వచ్చాయి. ఆయనకు అలా నష్టం

రావడానికి అన్నమాట నిలబెట్టుకోవాలని పట్టుపట్టడమే ప్రధాన కారణమని అంతా అనుకొన్నారు. ఆయన మాటకు ఎక్కువ విలువ ఇచ్చేవారు.

ఏదో ఒక సరుకుకొని అమ్మడంలో తృప్తిపడ్డ మనిషికాడాయన. ఒకసారి ధాన్యంకొని అమ్మేవాడు. ఆ కొనడం మామూలుగా కొనడం కాదు. ఆ ఊళ్లో ధాన్యపు వర్తకులు, మిల్లు యజమానుల దగ్గరకు స్వయంగా వెళ్ళి రేటు నిర్ణయించి వాళ్ళదగ్గర నిలవఉన్న సరుకునంతా కొనేసేవాడు. వాళ్ళెవరి దగ్గరకూడా ఇక ఒక్కగింజ అయినా మిగలనిచ్చేవాడు కాడు. ఆ ధాన్యం అంతా అధునికమైన పద్ధతులలో సొంత గోదాములలో నిలువచేసి మంచిరేటు వచ్చాక ధాన్యం విడుదల చేసేవాడు. అపరాలు అయినా అంతే- వేరుసెనగ అయినా అంతే. మిర్చి పంటమీద ఉన్నప్పడే కోనేవాడు. ఆయన బజారులోకి వచ్చాడూ అంటే అందరికి గుండె దడదడలాడేది. ఆయన ఒకనాటి సరదాకు కాయగూరల మార్కెటుకు వెళ్ళి అక్కడవున్న సరుకు అంతా కొనేవాడు. రెండుగంటల తర్వాత మళ్లీ సరుకు అంతా విడుదల చేశాడు. ఆ కానేపటిలోనూ ఆయన అయిదువేలు సంపాదించాడు. మరోసారి ఆయన అలాగే సరదాకు పూల మార్కెటుకు వెళ్ళాడు. లారీలమీద ఉన్న పూలబుట్టలు బేరం చేశాడు. ఆ వ్యాపారికావాలని నవ్వుతూ "మీరెందుకొస్తారు ఈ వ్యాపారంలోకి. నేను ఒక్కమాట అంటాను. ఇవాళ చిల్లరగా వీటికే ధర ఉన్నదో ఆ ధర ఇవ్వండి. ఇవ్వన్నీ మీకు వప్పగించి వెళ్లిపోతాను" అన్నాడు. ఆయన ఒక్క నిముషం ఆలోచిస్తున్నట్లు కన్పిస్తే ఆ వ్యాపారి "మీరు లక్షాధికారి అయితే కావచ్చు. కాని నేను చెప్పిన ధరకు కొనగలరా? కొంటానని అనగలరా... అన్నమాట నిలుపుకోగలరా... ఎందుకంటే సరుకు అటువంటిది. ఒక్కరోజు గడిస్తే పూలు వాడిపోతాయి..." అన్నాడు.

ఆయనకు కొంచెం రోషం వచ్చింది. ఆ బుట్టలన్నీ ఏకమొత్తంగా కొనేశాడాయన. డబ్బు ఇచ్చి ఆ వ్యాపారిని పంపించి వేశాక చిల్లర బేరగాళ్లముందు బుట్టలు కుమ్మరించాడు. అవి అలా కుమ్మరించేసరికి మోసం బయటపడింది అందులో సగానికి పైగా కుంటిపూలు, గుడ్డిపూలూ. పదివేలు నష్టం భరించవలసి వచ్చింది. ఆ పూలన్నీ మళ్ళీ ఆ బుట్టలలోనే ఎత్తించి లారిలో మరోఊరు చేర్పించి, ఆ ధరకు ఎవరికో ఒకరికి అంటగంట వచ్చునని ఆయన స్నేహితులు సలహా ఇచ్చారు. కాని ఆయన ఒప్పుకోలేదు. "ఛీఛీ మాట పోతుంది. పోయిన పదివేలు మళ్లీ సంపాదించగలను. కాని మాటపోతే ఈ జన్మలో సంపాదించలేను..." అన్నాడాయన. ఆయన అప్పటికప్పుడు ఆ పూలరాసులలో మంచివి ఏరించి, మూటలు కట్టించి మంగళగిరి ఆలయానికి పంపించాడు.

వ్యాపారంలో నష్టం వస్తుందేమోనని ఆయన ఎన్నడూ భయపడలేదు. కాని అన్నమాట ప్రకారం బాకీ తీర్చలేకపోతానేమోనని ఆయన ఎప్పుడూ భయపడుతూనే ఉండేవారు. ఆ భయంవల్లనే ఆయన చాలా పెద్ద మొత్తంలో డబ్బు ఇంట్లో పెద్ద ఇనప్పెట్టెలో భద్రపరచి ఉంచేవాడు. ఆ విషయంలో ఆయన భార్య అనేకసార్లు ఆయనతో తగూలాడింది. డబ్బు బ్యాంకులో ఉంటే భద్రంగా ఉంటుంది. ఇంత డబ్బు ఇంట్లో ఉండడం క్షేమంకాదు. మీదంతా చాదస్తం ఇవాళ ఇస్తానన్న సొమ్ము ఇవాళే ఇవ్వకపోతే కొంపలంటుకొంటాయా? ఇవాళ కాకపోతే రేపు ఇవ్వవచ్చు. ఏం నష్టంలేదు. అందరికి మీమాట అంటే నమ్మకం ఏర్పడింది. అనవసరంగా మాట పట్టింపులకు పోకండి. బ్యాంకులో వేస్తే మనకు వడ్డీకూడా వస్తుంది. అసలు పెద్ద వ్యాపారస్తులంతా అలాగే చేస్తారని మానాన్న చాలాసార్లు చెప్పాడు. అంతేకాదు..." అని ఇంకా ఏమో చెప్పబోతూ ఉండగా ఆయన

అడ్డువచ్చి ఆ, ఆ ఇంత చెప్పకు వినకవినక మీనాన్న సలహాయే వినాలా; ఇంకా నయం ఆయనలా అప్పు పత్రాలు వ్రాసి వాటిమాట మరచిపొమ్మనలేదు. అప్పులు చేయడంకంటె అప్పులు తీర్చడం నాకు సరదా. డబ్బు శాశ్వతంకాదు, మాట శాశ్వతం. పరపతిఉంటే చాలు. అందుకు పదిరెట్లు వ్యాపారం పెరుగుతుంది. నాకు దొంగ భయంలేదు. మొదటినుంచీ బీదలకూ, బంధుమిత్రులకూ సహాయం చేస్తున్నాను. ఇంతవరకు ఎవ్వరికీ అన్యాయం చెయ్యలేదు. ఇకముందు చెయ్యను. నా డబ్బు ఎంతపోయినా బెంగలేదు. మళ్లీ వస్తుంది. లోకుల సొమ్ము పోకుండా ఉంటేచాలు. మనమాటకు విలువ ఉంటే చాలు. డబ్బు సంపాదించడం ఓ లెక్కకాదు. ఒకమాట చెప్తాను విను. ఇదంతా మన ప్రజ్ఞ అనుకొంటున్నావా? కాదు. వారు ఇస్తున్నారు, నేను పుచ్చుకొంటున్నాను..." అన్నాడు.

కుటుంబరావుకు భార్యమీద అమితమైన నమ్మకం. ఆయనకు ఆవిడంటే అంతులేని అభిమానం. ఇనప్పెట్టెలో డబ్బు వెయ్యడానికి, తియ్యడానికి ఎప్పుడూ ఆవిడనే పిలిచేవాడు. ప్రతిరోజూ ఇంటికి రాగానే సంచిలోనుంచి నోట్ల కట్టలు ఆవిడ చేతికి ఇచ్చి "ఇదిగో ఈ ఇరవై వేలూ అందులో వడేయ్. ఈ డబ్బుమూట వేరే పెట్టి ఉంచు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఒకరికి ఇవ్వాలి. రెండు రోజులు ముందుగా సిద్ధంచేసి ఉంచాననమాట ఇలా అంటూ ఉండేవారు.

లెక్క వ్రాయడంలో ఆయనకు ఆయనే సాటి అని పేరు వచ్చింది. ఆయన కొట్లో నలుగురు గుమాస్తాలు ఉన్నారు. వాళ్ల ఎక్కడ ఏ చిన్న పొరపాటు చేసినా పట్టుకొని నాలుగూ దులిపి "ఇలా అయితే నా దగ్గర మానుకోవడం మంచిది" అనేవాడు. వాళ్ళు తలవంచుకొంటే చాలు ఆయన ఇక ఆ విషయం మరచిపోయేవాడు

కుటుంబరావు ఎప్పుడూ పెద్దగా నవ్వేవాడు.

*　　　*　　　*

పొగాకు టోకు వ్యాపారం ఆరంభించిన మొదటిరోజులలో ఆయనకు విపరీతంగా లాభం వచ్చింది. ఇంకేముంది కుటుంబరావు కోటీశ్వరుడై పోతున్నాడని అంతా అనుకొన్నారు. ఆయన జిల్లా మొత్తంమీద ఎక్కడెక్కడి పొగాకుకొనేసి, పెద్ద కంపెనీలకు అమ్మడం మొదలుపెట్టాడు. పొగాకు వ్యాపారం నిర్వహించడానికి పెద్ద భవనం కట్టించి అందులో ఆఫీసు పెట్టాడు. ఆయన కారు కొన్నాడు. పొగాకు రవాణా విషయంలో ఇతరులమీద ఆధారపడడం మాట పడవలసిరావడం జరిగింది. అందుకు కోపం వచ్చి ఆయన మూడు లారీలు కొన్నాడు. వాటిని తన దగ్గర పనిలేనప్పుడు బాడుగకు తిప్పాడు. లారీలమీద విచ్చిడబ్బు వచ్చింది. స్థిరాస్తులు కాక నగదు రూపంలో ఆయన దగ్గర పదిలక్షలు నిలువ ఉన్నాయని చెప్పకోవడం మొదలుపెట్టారు.

ఆయన పొగాకు వ్యాపారం చాలా ఎత్తుకు పెంచాడు. విదేశాలకు ఎగుమతి చెయ్యడంకూడా ప్రారంభించా డాయన. ఆ వ్యాపారంమీదనే ఆయన కొన్ని ఐరోపా దేశాలకు వెళ్ళివచ్చాడు. ఒకసారి జపాన్ సందర్శించి వచ్చాడు. ఆయన వ్యాపారం ఉచ్ఛదశ అందకొన్నది.

పొగాకు వ్యాపారం అలా క్రమంగా అభివృద్ధిచెందుతూ ఉండగా ఆయనకు ఒక్కసారిగా పాత కమీషన్ కొట్టుమీద పెద్ద నష్టాలు రావడం మొదలుపెట్టాయి. ఆ కొట్టు దివాళా తీసింది. అంటేచాలు బాకీదారులు సగంమంది ఆయన్ను ఇట్టే విడిచిపెట్టేవారు. కాని కేవలం తనమాట విలువపోకుండా నిలబెట్టుకోడానికి ఆయన ఆ నష్టం పూర్తిగా భరించాడు. పైగా అందరితో నవ్వుతూ "ఆ కొట్టుమీద వచ్చినా ఈ

కంపెనీకి వచ్చినా ఒకటే ఊరికే లెక్కలు తేల్చడంలో సౌకర్యం కోసం అది నా అల్లుడిపేర పెట్టాను. అంతేకాని బాకీలు ఎగవేయడం కోసంకాదు. ఈసారి ఇలా బాకీలన్నీ నన్ను తీర్చేయనీయండి. బాకీలు ఎగవేయడానికి మరో క్రొత్త కంపెనీ పెడతాను..." అన్నాడు.

ఆ నష్టం భరించడంవల్ల ఆయన దగ్గర నిలువవున్న సొమ్ములో అయిదారు లక్షలు ఇట్టే కరిగిపోయాయి. ఆయన ఆ దెబ్బనుంచి పుంజుకొంటూ ఉండగనే మరో గట్టిదెబ్బ తగిలింది. నిలువచేసిన పొగాకు కొంత దెబ్బ తిన్నది. అది తక్కువ ధరకు అమ్మవలసి వచ్చింది. ఆయన కొంచెం దిగులుపడ్డాడు. అందులో క్రొత్తగా స్థాపించబడిన ఒక పెద్ద స్వదేశీ కంపెనీ ఆయన దగ్గర చాలా పెద్ద మొత్తంలో పొగాకు కొనడానికి సంసిద్ధత తెలియచేసింది. ఆయన బేరం కుదుర్చుకొన్నాడు ఊళ్ళో పదిమంది దగ్గరకూ వెళ్ళి ఏడు లక్షల వరకూ పోగుచేసి తీసుకొనివచ్చి, తన డబ్బుకూడా కలిపి సరుకుకొన్నాడు. తన సొంత లారీలేకాక ఊళ్లో లారీలుకూడా మాట్లాడి సరుకు ఆ కంపెనీకి చేరవేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేశాడాయన. అంతలో ధరలువడిపోయాయి. ఆ స్వదేశీ కంపెనీ అయన్ను దగా చేసింది. ఆ కంపెనీ యజమాని సరుకు పంపవద్దని ఫోన్‌చేసి చెప్పాడు. "అలా వీలులేదు. సరుకు తీసుకొని మీకు పూర్వం ఒప్పుకున్న ప్రకారం డబ్బు చెల్లించవలసిందే. ఇలా దగాచేయాలని ప్రయత్నిస్తే నేను కోర్టుకువెళ్లి ఇంతకు పదిరెట్లు కక్కిస్తా జాగ్రత్త..." అని ఆయన బెదిరించాడు. ఆ కంపెనీవాళ్లు బెదిరిపోయి ఆరోజే దివాళా తీసినట్లు ప్రకటించి, కంపెనీ హఠాత్తుగా మూసివేశారు. వ్యాపారంలో అలా మాట పోగొట్టుకొని, అంత దుర్మార్గం చెయ్యగలరని ఆయన ఎన్నడూ ఊహించలేదు. ఆయన అవతల వాళ్లను నమ్మి బేరం కుదుర్చుకొన్నాడు. కాని వాళ్లు మోసంచేశారు. ఆయన్ను నమ్మి లక్షల

కొద్దీ సొమ్ము ఇచ్చినవాళ్లకు సమాధానం చెప్పవలసివచ్చింది. చాలా గడ్డు పరిస్థితి ఎదుర్కోవలసివచ్చింది ఆయన. ఊళ్లో పెద్ద లాయర్లతో మాట్లాడి ఆ కంపెనీ మీదా, ఆ కంపెనీ యజమానులమీదా దావాలు వేయించాడు. ఆ పని పూర్తికాగానే మరో కంపెనీతో ఆ రోజు ఉన్న ధరకు తనదగ్గర ఉన్న సరుకు అంతా తీసుకోడానికి ఒప్పందం కుదుర్చుకొన్నాడాయన. వాళ్లు వెంటనే డబ్బు చెల్లిస్తామన్నారు. ఊళ్లో పదిమంది దగ్గరా తెచ్చిన మొత్తం మేరకు అలా సొమ్ము వసూలు అవుతున్నందుకు ఆయన సంతోషపడ్డాడు. అంతపెద్ద నష్టం వచ్చినందుకు ఆయన తల్లక్రిందులై పోతారనీ, తనూ దివాళాతీసి అందర్నీ ముంచేస్తాడనీ నలుగురూ అనుకొన్నారు. అలా అని బయట వాళ్లేకాదు. ఆయన కంపెనీలో పనిచేస్తున్నవాళ్ళే అనుకొన్నారు. అనుకోవడమేకాక ఆయన దగ్గరకువెళ్లి రహస్యంగా అలా చెయ్యమని సలహా చెప్పారు. అప్పుడాయనకు పట్టరాని కోపం వచ్చింది. కాని తమాయించుకున్నాడు. అప్పటికప్పుడు వాళ్ళముందే బాకీదారులను కొందరిని పిలిపించి జరిగినదంతా వినిపించాడు.

వాళ్లు అందరూ ఆశ్చర్యపడ్డారు. వాళ్లలో ఆయనకు అత్యంత సన్నిహితులైనవాళ్లు "ఇదేమిటి ఇలా చేశారు. మాకు ఇవ్వాలని ఎక్కడుందీ ఇల్లాంటి విపత్కర పరిస్థితి ఏర్పడినప్పుడు మీరు ఇలా ఎందుకు చేశారూ? ఇన్నాళ్లూ మీ సొమ్ము తిన్నాం వడ్డీ ఇచ్చారు. మా డబ్బు నాలుగయిదు రోజులు వాడుకొన్నా నెలరోజులవడ్డీ తీసుకొన్నాం. కొన్నిసార్లు లాభాలలో వాటాకూడా ఇచ్చారు. ఆ కంపెనీమీద వేసిన దావాలన్నీ తీరేక మాకు సొమ్ము ఇద్దురుగాని, అప్పటిదాకా మేం ఆగుతాం. ఈ వచ్చిన నష్టం భర్తీకావాడానికి మరేదైనా చెయ్యండి..." అన్నారు.

ఆయన అంతా విని చిరునవ్వు నవ్వుతూ "అలాకాదండీ మీరు రేపు డబ్బు పుచ్చుకొని తీరాలి. నేను మాట నిలబెట్టుకొన్నా ననే తృప్తి నాకు మిగలనివ్వండి. అసలు బాకీలన్నీ ఇవ్వాళే తీర్చేసేవాణ్ణి. వాళ్లు చెక్కు ఇచ్చారు. అది రేపు మారుస్తాను. ఎల్లుండి ఎవరి సొమ్ము వారికిస్తాను..." అన్నాడు.

*　　　*　　　*

ఆ రోజూ, అ మర్నాడూ ఆయనకు అనేక రకాల సలహాలు ఇచ్చారు. వారిలో కొందరు ఆయనయందు నిజంగా సానుభూతి కలవాళ్లు. మరికొందరు ఆయన్ను బాధించి మాట తప్పాడని అనిపించి ఆయనకు ఉన్న పరపతిఅంతా పోగొడదామనుకొన్నారు. అలాచేసి వ్యాపార రంగంలో ఆయన పోటీలేకుండా చేసుకొందామని వాళ్ళు ఆశించారు.

ఆయన ఆరోజు చెక్కు మార్పించి సొమ్ము ఆఫీసుకు తెప్పించాడు. మధ్యాహ్నం చాలా సేపు శ్రమపడి లెక్కలుతేల్చి మూడింటికి ఇంటికి వచ్చాడు. గుమ్మంలోనే భార్యను పలకరించి "ఇదుగో ఈ సొమ్ము మొత్తం ఇనప్పెట్టెలో పెట్టు. తాళాలు జాగ్రత్తగా వెయ్యి... మరచాను ఆ గదికికూడా పెద్దతాళంవెయ్యి... రేపు ఉదయం అరగంటలకల్లా ఎవరిసొమ్ము వారికి ఇచ్చేస్తాను. నష్టంవచ్చింది కనుక ఎగేస్తానేమోనని వాళ్ళు భయపడిపోతున్నారు. ఈ సమయంలో వాళ్ల భయంతీర్చితే నామాట విలువ పెరుగుతుంది. ఈ ఏడెనిమిది లక్షలూ తీరిస్తే ఇంతకు మూడురెట్లు తేగలను. భద్రం—ముందువెళ్లు..." అన్నాడాయన.

ఆయన పెద్ద పట్టెమంచంమీద పడుకొని కళ్లుమూసుకొని నిద్రపోవడానికి ప్రయత్నించాడు కాని నిద్రపట్టలేదు. ఒక అరగంట తర్వాత ఆయనలేచి మంచి బట్టలు వేసుకొని భార్యను పిలిచి "నువ్వు

త్వరగా వెళ్ళి నా ఇనుప బీరువాతీసి క్రింద అరలో బట్టల క్రింద ఒక గుడ్డసంచీ ఉంటుంది. అది తీసుకొనిరా. అందులో పదివేలు ఉండాలి. ఆ సొమ్ము తీసుకొని మంగళగిరి వెళ్ళివస్తాను. ఒక్కసారి స్వామివారి దర్శనంచేసుకొని వస్తాను. అప్పటికిగాని నాకు మనస్సుకు శాంతి లభించేలాలేదు. ఎందుకో ఇవాళ కొంచెం చిరాకుగా, ఏదో దిగులుగా ఉన్నది. ఎందుకో తెలియడంలేదు. గత వారం అంతా రకరకాల ఆందోళనలకు గురికావడం అందుకు కారణం కావచ్చు. సరే పరిస్థితి అంతా నీకు తెలుసుగా. ఎలాగైనా ప్రతిజ్ఞ నిలబెట్టుకోవాలి. నిన్నుకూడా రమ్మనేవాణ్ణేకాని ఎందుకో భయంగాకూడా ఉన్నది. లోకుల సొమ్ము అంత పెద్దమొత్తం — అందులో రేపు ఇవ్వవలసిన డబ్బు ఇంట్లో ఉండగా మనం ఇద్దరం ఇంట్లో లేకుండా ఊరువెళ్ళడం మంచిదికాదు. సరే నేను వెళ్లి కొంచెం ఆలస్యంగావస్తాను" అన్నాడు.

ఆయన భార్య నవ్వుతూ "ఏం ఆలస్యం ఎందుకు అవుతుందీ? మళ్ళీ గాలిగోపురం ఎక్కివస్తారా? అయినా ఎన్నిసార్లు ఎక్కినా మీకు ఆ సరదా తీరలేదా?" అన్నది.

"అబ్బే, అంతేకాదు, ఈసారి అటువెళ్లినా పైకి ఎక్కను..." అని ఆయన కొన్నిక్షణాలు ఆగి "మరి త్వరగావెళ్లి ఆ సంచీ తీసుకొనిరా..." అన్నాడు.

* * *

కుటుంబరావు కారులో మంగళగిరివెళ్ళి, దేవస్థానం అధికారులను కలుసుకొని, తను ఏటా ఇచ్చే చందాక్రింద ఆ పదివేలూ జమకట్టి, గబగబా కొండ మెట్లన్నీ ఎక్కి గుళ్లోకి వెళ్లాడు. స్వామిదర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు కొంచెం ఎక్కువ అడిగితీసుకొని, అక్కడే అవి సేవించి, ఎంతో తృప్తిపడి క్రిందకుదిగాడు. ఆయన ఒక్కొక్క

మెట్టుదగ్గరా రెండుమూడు నిమిషాల చొప్పున ఆగుతూ నెమ్మదిగా మెట్లుదిగి ఊళ్లోకి వెళ్లాడు. అక్కడినుంచి సరాసరి కారులో గాలిగోపురం దగ్గరకువెళ్లి బయటకు దిగి, అక్కడ చాలాసేపు ఆలోచించాడు.

కుటుంబరావు అక్కడ నిలబడి వ్యాపార విషయాలన్నీ సమగ్రంగా పరిశీలించి, త్వరలో నష్టం భర్తీ అయ్యేలాచేసి, పూర్వంలా తనమాట నిలబెట్టుకొని పరపతి పెంచుకోడానికి ప్రణాళిక రూపొందించుకొన్నాడు. ఆ ప్రణాళిక కట్టుదిట్టంగా అమలుపరచే పద్ధతులను గురించికూడా ఆయన జాగ్రత్తగా ఆలోచించాడు.

ఆయనకు ధైర్యం వచ్చింది.

ఏనుగంత బలం వచ్చింది ఆయనకు.

ఆయన ఆ రాత్రి పదిగంటలకు సంతోషంగా ఇంటికి తిరిగి వచ్చాడు. అలా వచ్చేసరికి ఆయనభార్య ఇంట్లోలేదు. అందుకు ఆయన మనసుకు కష్టం కలిగింది. తనమనసు బాగుండలేదని తెలిసికూడా, మరునాటి ఉదయందాకా ఎంతో జాగ్రత్తగా ఇల్లు కనిపెట్టుకొని ఉండమని గట్టిగా చెప్పిన తర్వాతకూడా ఆవిడ ఇలా నిర్లక్ష్యంగా, బాధ్యతలన్నీ నౌకర్లమీద పెట్టి వెళ్లినందుకు ఆయనకు కోపంకూడా వచ్చింది. అందువల్లనే ఆయన కోపంగా గబగబా వెళ్లి తనగదిలో మంచంమీద పడుకొన్నాడు. ఆయనకు కునుకుపట్టింది.

పదకొండు గంటలు కావస్తుండగా వంటావిడ నెమ్మదిగా వచ్చి ఆ గది గుమ్మందగ్గర నిలబడి కొంచెం పెద్దగా "అయ్యా కుటుంబరావు గారూ చాలా ప్రొద్దుపోయింది... భోజనానికిరండి వడ్డిస్తాను..." అన్నది.

అందుకు ఆయన "పోనీ మీరువెళ్లండి. ఈవేళ ఆవిడ వడ్డిస్తుంది. నేను వడ్డించడం మానేసి చాలాకాలం అయింది. ఇప్పుడదే వడ్డిస్తున్నది లెండి" అన్నాడు నవ్వుతూ.

ఆవిడ ఆయనవంక అలాచూస్తూ నిలబడితే, లేచికూర్చుని "ఏం మీకు అర్థం కాలేదా ? అది మొదటిరోజులలో కొంచెం వెంకె. అందువల్ల రెండు మూడుసార్లు వడ్డించాను మీరు పెద్దవారు. మీతో హాస్యానికైనా ఇలా అనకూడదు. కాని అన్నాను. క్షమించండి... నాకు ఆకలిగా లేదు. అక్కడ ప్రసాదం కొంచెం ఎక్కువ తిన్నాను. నేను రెండుచోట్ల మాత్రమే మొహమాటపడను. ఇక్కడ మా ఆవిడ దగ్గరా, అక్కడ స్వామి దగ్గరా. నేను పూర్తిగా నమ్మిందికూడా వీరు ఇద్దరినే. ఇలా నమ్మకొన్నందుకు నా జీవితం హాయిగానే గడిచిపోయింది ఇవాళ అక్కడ ఇంకాస్త ప్రసాదం పెట్టమని అడుక్కొంటున్నప్పుడు నాకేమీ అభిమానం అడ్డురాలేదు. మరోమాట చెప్పనా, ఈ వ్యాపారం అంతా పోయినా, ఆస్తి అంతా కొట్టుకుపోయి తిండికికూడా గడవని స్థితివచ్చినా నాకు ఇక దిగులులేదు. స్వామి పాదాలదగ్గర పడిఉంటాను ఆ ప్రసాదం చాలు బ్రతకడానికి అలా అనిపించింది. సరే ఏదో మాట్లాడేస్తున్నాను మీరు వెళ్లండి." అని ఆయన మళ్లీ పడుకొన్నాడు. అయిదు నిమిషాల తర్వాత ఆవిడ "పోనీ కాస్త మజ్జిగ తెస్తాను. తాగి పడుకోండి" అన్నది. అందుకు ఆయన నవ్వుతూ "అదేం అలా అనేశారు. కాసేపు అయాక ఆకలివేస్తుంది. ఇవాళ శనివారం కాదుగా— అందుకని అన్నం తింటాను. నిజం చెప్పనా అలిగి పడుకొన్నా. అదివచ్చి బ్రతిమిలాడితే శుభ్రంగా తినేస్తాను." అని కొన్ని క్షణాలు ఆగి ఏదో జ్ఞాపకంవచ్చి అడుగుతున్నట్లు నెమ్మదిగా "ఇంతకూ మీ అమ్మగారు ఎక్కడకెళ్ళిందీ? చెప్పకుండా ఎక్కడకూ వెళ్ళదే?" అన్నాడు.

అంతకు ఆవిడ తటపటాయిస్తూ "అంటే అసలు మీకూ ఏమీ తెలియదంటారా ?" అన్నది.

"ఏమిటీ...?"

"అంటే అమ్మగారు ఊరువెళ్లిన సంగతి."

ఆ మాట వినగానే ఆయన ఉలిక్కిపడి చప్పున లేచికూర్చుని "ఏమిటీ—ఊరు వెళ్లిందా; ఇంకా నయం లేచిపోయిందన్నారు కాదు" అన్నాడు నవ్వుతూ.

"అదేమిటండీ నేనంతమాట అంటానా, అమ్మగారు ఈరోజు సాయంత్రమే ఊరువెళ్తానని నాతో అన్నారు. మీ మామగారు వచ్చారుగా. హడావిడిగా పెట్టేబేడా సర్దుకొని ఈపూట ఎనిమిదింటికే వారిద్దరూ వెళ్ళారు. సరే, నేను తొందర పెట్టాననుకోకండి, మీరు ఎప్పుడువచ్చినా వడ్డిస్తాను" అని నెమ్మదిగా వెనుతిరిగి వంట ఇంటివైపు నడిచింది.

కుటుంబరావు నెమ్మదిగా లేచి నిలబడి, ఆవిడను వెనక్కు పిలిచి వివరాలు అడిగి తెలుసుకొందామనుకొని, మళ్ళీ అంతలో ఆ ప్రయత్నం మానుకొని అంచే చూస్తూ ఉండిపోయారు. 'మామగారు రావడమేమిటీ - ఈవిడగారు ఇటువంటి సమయంలో ఇంత హడావిడిగా, సామాను సర్దుకొని ఆయనవెంట వెళ్లడమేమిటీ ?' అనుకొని ఆయన ఆశ్చర్యపడ్డారు. ఆయన ఇలా అయిదు నిముషాలు నిలబడిపోయారు.

అంతలో ఆయనకు ఏదో అనుమానం వచ్చింది. ఆయన గబగబా లోపలి గదిలోకి వెళ్లాడు. అక్కడినుంచి ఒక్క దూకున ఇనప్పెట్టె ఉన్న గదిలోకి వెళ్లాడు. ఆ గదితలుపు తీసే ఉన్నది. 'ఇదేమిటి?' అనుకొంటూ ఆయన నెమ్మదిగా ఇనప్పెట్టి దగ్గరకు వెళ్లాడు. దానిపై చివరగా పెట్టిఉంచిన తాళంచెవులు తీసుకొని ఆయన నెమ్మదిగా,

ఏదో ఆలోచిస్తూ పెట్టె తెరిచాడు. ఆయన భయం భయంగా అన్ని సొరుగులూ తెరిచి చూచాడు.

డబ్బు కన్పించలేదు.

అందులో భద్రపరచిన ఏడెనిమిది లక్షలూ అదృశ్యమయ్యాయి. క్రింది అరలో ఎన్నో దస్తావేజులు ఉండేవి. అవీ కన్పించలేదు. ఆ ఇనప్పెట్టె అంతా ఖాళీగా, బోసిగా తన్నుచూచి వెక్కిరిస్తున్నట్లుగా కన్పించింది.

అసంభవం. దొంగలెవరో వచ్చి అంతా దోచుకొనిపోయారని అనుమానించడానికి ఆస్కారంలేదు. దాని దగ్గర ఎంతో భద్రంగా ఉండవలసిన తాళంచేతులు ఇక్కడెందుకు ఉన్నాయి? ఇది మరొకరుచేసిన పనికాదు. అవును, కానేకాదు. నమ్మిన మనిషి చేసుకొన్న భార్య - పిల్లలతల్లి - అది ఇలా చేస్తుందా? చేసింది. తండ్రి సలహా చెప్పి ఉంటాడు. కాని—కాని ఆయన సలహామీద కట్టుకొన్న మొగుడికి ఇంత ద్రోహం చేస్తుందా! ఇప్పుడు ఆయన సలహా ఎందుకు కావలసి వచ్చింది? పోనీ నాతో ఆమాట చెప్పవచ్చుగా - నన్ను మోసం చేస్తుందా. ఈ వయసులో - పోనీ తను వయస్సులోఉండి డబ్బు తీసుకొని లేచిపోయిందంటే ఏదో ఆశపడిందని అనుకోవచ్చు. కక్కుర్తి పడిందని అనుకోవచ్చు. అలా కాదే—ఎంతడబ్బు చేతికిచ్చాను. కేవలం తన ఖర్చులకోసం. తనకిప్పుడు ఎంత వయస్సు వచ్చింది! పోనీ పిల్లలు చిన్నవాళ్లయితే వాళ్లకోసం నన్ను త్యజించి ఏదో పాడుపని చేసిందని అనుకొని సర్ది చెప్పుకోవచ్చు. కాని సందర్భం అటువంటిది కాదే! పిల్లలు చక్కగా పెద్దవాళ్లయారు. ఒక్కొక్కళ్లకి పాతికేసి వేలు కట్నాలు ఇచ్చి పెళ్లిళ్లు చేశాను ఆడపిల్లలు ముగ్గురికీ. మొగపిల్లలు లేరని మొదట్లో దిగులుపడ్డా తర్వాత తర్వాత ఆమాటే మరచిపోయాను.

ఇంత ఆస్తి ఉన్నది ఎందుకుచేసిందిలా ? పోనీ ఆస్తి అంతా నా ఒక్కడి పేరనే ఉంటే అందుకోసం చేసిందని అనుకొందును. ఆస్తి అంతా ముందే అందరికి సమానంగా పంచి ఇచ్చానుగదా. తన వాళ్లందరికీ ఎప్పుడు కావాలంటే అప్పుడు - ఎంత అడిగితే అంతడబ్బు ఇచ్చి సహాయపడ్డానే. పుట్టింటికి ఇలా డబ్బు తీసుకొని పారిపోవలసిన అగత్యం తనకేం పట్టింది. మామగారు ఎంత దుర్మార్గంచేశారు ! ఇంత పాడుపని చెయ్యమంటాడా ? ఆయన చెయ్యమంటేమాత్రం తానింతపని చేస్తుందా ? నా పరువు ప్రతిష్ఠలు మంటగలిపే పని తానుగా ఎందుకు చేసింది ? ఈ డబ్బు తెల్లవారి ఆరు గంటలకల్లా వాళ్లకు ఇవ్వాలి. ఇంకేం ఇస్తాను. వాళ్లందరిముందూ నామాటపోతుంది. ఇక ఈ జన్మలో నా మాటకు విలువ ఉండదు. నేను ఇంక బయట తల ఎత్తుకు తిరగలేను. ఇంత నమ్మకద్రోహంచేసి, పుట్టింటికి చేరవేసిన మనిషి ఆ సొమ్ము నేను వెళ్లి అడిగితేమాత్రం ఇస్తుందా ! ఇవ్వదు. ఆయన ఇవ్వనియ్యడు. అసలు ఈ రాత్రి ఆ కుగ్రామానికి - అంతదూరం వెళ్లడం ఎలా ? అదేనా ఇంత ప్లానువేసిన వాళ్లు సరాసరి అక్కడికే వెళ్లారని నమ్మకం ఏమిటి ? మరెక్కడికోపోయి దాక్కొన్నదేమో ! వెళ్లి వెతికే అవకాశం లేదు. వాళ్లను వెదకడానికే కొన్ని రోజులుపట్టినా పట్టవచ్చు. అందరికి తెలిసిపోతుంది. ముందు ఆడదానిచేత డబ్బి అవతలకు దాటవేయించాడని నన్ను అంతా ఆడిపోసుకొంటారు. అవహేళనచేస్తారు కేసులు పెడతారు, పట్టుకొంటారు... అయ్యయ్యో ఎంతపనిచేసింది. నమ్మిన మనిషికి నిష్కారణంగా ఎంత అన్యాయం చేసింది ? అడిగితే ఇంతకు పదిరెట్లు ఇచ్చేవాణ్ణికదూ— లోకులసొమ్ము కాజేయవలసిన నీచమైన స్థితికి తనెందుకు దిగజారింది ? అన్ని విషయాలూ తెలుసునే ! ఇన్ని సంవత్సరాలు నన్ను ఇంత నమ్మించిందే ; ఇప్పుడెందుకు ఇలాచేసింది ?'

ఆయన అలా అని పెద్దగా అరిచాడు.

ఆ అరుపే ఆయన ఆలోచనలకు అంతరాయం కలిగించింది.

ఆయన గుండె బాదుకొన్నాడు.

తల బాదుకొన్నాడు, జుట్టు పీక్కొన్నాడు. ఆయనకు తల తిరిగిపోయింది. హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. ఆయన ఒకచేత్తో తల పట్టుకొన్నాడు. మరోచేత్తొ గుండె అదుముకొన్నాడు.

వంటావిడ అయన్ను వెతుక్కొంటూవచ్చి ఆ గది గుమ్మంలోనే ఆగిపోయి "అదేమండీ పన్నెండుదాటినా భోజనానికి రాలేదు—" అని ఆగిపోయి "అదేమండీ కుటుంబరావుగారూ అలా ఉన్నారు? అసలు ఏమైందీ?" అని అడిగింది గాభరాపడుతూ.

ఆయన పెద్దగా నవ్వుతూ "గాలిగోపురంపైన ఈదురు గాలిలో ఒంటరిగా నిలబడినట్లుగా ఉన్నదండీ. కళ్లు తిరిగిపోతున్నాయి. గుండె దడదడలాడి పోతున్నది. అంత ఎత్తునుంచి-అక్కడినుంచి-వెనుకనుంచి నన్ను తోసేస్తున్నారు. అమ్మో..." అంటూ ఆయన మొదలు నరికిన తాడిలా విరుచుకొని పడిపోయాడు. అప్పటిదాకా సంశయిస్తూ, భయపడుతూ గుమ్మంలో నిలబడ్డ వంటావిడ 'అయ్యయ్యో' అంటూ చప్పున లోపలకువచ్చి, ఆయన్ను చెయ్యి పట్టుకొని లేవనెత్తడానికి ప్రయత్నించింది. ఆయనకు ఒళ్లంతా చెమటలుపోసి ఉన్నాయి ఆయన చేతులు చల్లగా ఉన్నాయి.

అప్పటికే ఆయన ప్రాణం విడిచాడు.

---